క్లుప్తంగా

చాటపర్రులో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఏలూరు రూరల్ : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో పాఠశాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని ఎంపీహెచ్ఓ రామాంజనేయులు తెలిపారు. మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చాటపర్రు పీహెచ్‌సీ పరిధి పాఠశాలల్లో పిల్లలకు మాత్రలు పంపిణీ చేశామని తెలిపారు. ఏడాది వయసు నుంచి 19 ఏళ్ల వయస్సు గల బాలబాలికలకు అందరికీ నులి పురుగుల నివారణ మాత్రలు అందజేశామని వివరించారు. స్థానిక పెద్దలు, పలు పార్టీ నాయకుల సహకారంతో పాఠశాలలో బాల బాలికలు అందరిచే మాత్రలు మింగించామని తెలిపారు. మైక్రో యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రాంతాల వారీగా అబ్జర్వర్లను నియమించి పిల్లలు అందరికీ మాత్రలు అందించామన్నారు. కార్యక్రమంలో పెద్దలు కాలారి శ్రీనాథ్, పాతూరి వంశీ, భరత్, హెల్త్ సూపర్ వైజర్ కిరణ్, ఏఎన్ఎం సంధ్యారాణి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ రామకోటి వద్ద ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన ఊరేగింపు కార్యక్రమంలో ఒక యువకుడిపై మరికొందరు దాడి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 16 రాత్రి రామకోటి వద్ద ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన ఊరేగింపు కన్నయ్య పార్కు వద్దకు వచ్చేసరికి ఊరేగింపులో పాల్గొన్న తూర్పువీధికి చెందిన పి.రాజశేఖర్ అనే యువకుడి పై అదే ఊరేగింపులో పాల్గొన్న వాసు, ప్రవీణ్, విక్కీ అనే యువకులు ఘర్షణకు దిగారు. అక్కడ నుంచి అతను వెళ్లిపోగా మరోసారి గొడవ రాజీ చేసుకుందాం రమ్మని పిలిచి తేజ, వాసు, విక్కీ, ప్రవీణ్, సాయి అనే మరికొందరు రాజశేఖర్ అనే యువకుడిని కర్రలతో కొట్టి చంపుతామంటూ బెదిరించారు. గాయాలవడంతో బాధితుడిని 108లో ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

ఊరేగింపులో వేధింపులు

ఏలూరు టౌన్: ఏలూరు కొత్తపేట పెద్దింటివారి వీధిలో ఈ నెల 16న వినాయక నిమజ్జనం ఊరేగింపు కార్యక్రమంలో అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు, తమ్ముడు పాల్గొన్నారు. అదే ప్రాంతానికి చెందిన అగ్గాల ధనుష్, రోహిత్ సాయి, త్రిశూల్, నీరజ్ అనే యువకులు వారిపట్ల చులకనగా మాట్లాడుతూ చెయ్యి పట్టుకుని లాగుతూ వేధింపులకు గురిచేశారు. యువతి తమ్ముడు అడ్డుకోగా వారంతా అతనిపై దాడి చేశారు. గాయాలు కావడంతో అతన్ని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బాధితులకు అండగా ఆటో యూనియన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక మూడు చక్రాల ఆటో యూనియన్ అధ్యక్షుడు నగర బోయిన లీలా కృష్ణ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే బడేటి చంటికి మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా లీలా కృష్ణ, సంఘ గౌరవ అధ్యక్షులు గూడవల్లి శ్రీనివాసరావు, సెక్రెటరీ కొయ్యూరు బాబురావు, యూనియన్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఏలూరు (టూటౌన్): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమలో భాగంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని చర్చిలు, మసీదుల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి ఎస్ఎస్ కృపావరం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఏటా మహాత్మా గాంధీ జయంతి రోజున ఆయనకు నివాళులర్పించేందుకు అక్టోబరు 2న స్వచ్ఛ భారత్ దివస్‌గా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో యువతను భాగ స్వామ్యం చేయాలని, నిరుపయోగంగా ఉన్న ఫర్నీచర్ ఉపయోగంలోకి తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. శానిటేషన్ డ్రైవ్ ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కృపావరం కోరారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి యజ్ఞ మహోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవానుని జయంతి యజ్ఞ మహోత్సవం మంగళవారం శ్రీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పూజలు, అనంతరం సభా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం ఉపసభాపతి తుమ్మోజు రామలక్ష్మణా చార్యులు మాట్లాడుతూ ఈ విశ్వాన్ని సృష్టించి విశ్వంలోని మానవాళితో సహా సకల జీవరాసులకు దేవతలకు ప్రాణశక్తి నొసగినది విశ్వకర్మ భగవానుడని వివరించారు. వైశ్వకర్మణహోమం ద్వారా విశ్వకర్మ అనుగ్రహాన్ని పొంది, సర్వమానవాళి సకల శుభాలాను పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సమాజంలో విశ్వబ్రాహ్మణుల ప్రధాన్యత అనే అంశాలపై ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం రూపొందించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కార్యదర్శి అప్పలభక్తుల శివకేశవరావు (శివశ్రీ) వివరించారు. విశ్వబ్రాహ్మణులకు ఆలయ పాలకవర్గాల్లో ప్రభుత్వం స్థానం కల్పించాలని కోరుతూ సభా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బడేటి చంటికి వినతిపత్రం అందించారు.

కమ్యూనిటీ హాలకు స్థలం కేటాయించాలి

శ్రీవిశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సింహాద్రి భృంగాచార్యులు మాట్లాడుతూ ఏలూరులో ఉన్న 20 వేల మంది విశ్వబ్రాహ్మణుల అవసరాల కోసం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని, స్థానిక కామాక్షి విశ్వబ్రాహ్మణ ధర్మసత్రానికి విశ్వబ్రాహ్మణుల ప్రాతినిధ్యంతో పాలకవర్గాన్ని నియమించాలని కోరారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ సృజనాత్మకత నైపుణ్యం గల విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఉదయం పుణ్య దంపతులచే యజ్ఞ మహోత్సవం, విశ్వకర్మ ధ్వజారోహణం, పూజలు నిర్వహించారు. తొలుత విశ్వకర్మ పతాకాన్ని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ లక్కోజు గోపి ఆవిష్కరించగా, సంఘ ప్రధాన కార్యదర్శి మానేపల్లి నాగేశ్వరరావు కార్యక్రమానికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా, సంఘం లీగల్ ఎడ్వయిజర్ సున్నం బ్రహ్మం, గొల్లపల్లి కామేశ్వరరావు సిద్ధాంతి, యలబాక కృష్ణ, కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పొట్నూరి శివరావు, గౌరవ అధ్యక్షుడు కర్ర సత్యనారాయణ, సంఘం కోశాధికారి నాగమల్లి దుర్గా సురేష్, ఉపాధ్యక్షులు దాసోహం వెంకటేశ్వరాచార్యులు, దాసరోజు వీరాచారి, రాపాక వెంకట సన్యాసిరావు, వీర్ని వైణతేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం పురవీధులలో విశ్వకర్మ భగవానుని మంగళ వాయిద్యాలతో విచిత్ర వేష ధారణతో ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.



ఎమ్మెల్యే చంటికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హిందీ నికేతన్‌లో ఘనంగా హిందీ దినోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పవర్ పేటలోని హిందీ నికేతన్‌లో హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆ సంస్థ కార్యదర్శి పి.కవితా కుమారి తెలిపారు. ముందుగా హిందీ నికేతన్ వ్యవస్థాపకులు పిన్నింటి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవితా కుమారి మాట్లాడుతూ హిందీ నికేతన్ స్థాపించి 75 సంవత్సరాలయిన సందర్భంగా వజ్రోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. హిందీ నికేతన్ అధ్యక్షుడు వి.వెంకటస్వామి మాట్లాడుతూ మహాత్మా గాంధీ హిందీ ఉద్యమాలకు ప్రభావితులైన పిన్నింటి సత్యనారాయణ అలహాబాద్ వెళ్లి అక్కడే ప్రఖ్యాత సాహిత్యకారులు, భారతరత్న పురుషోత్తమదాస్ టాండన్‌కి సేవ చేస్తూ హిందీ భాషా, సాహిత్యాలను అభ్యసించి జీవితాంతం హిందీ సేవ చేయాలన్న తలంపుతో 1950వ సంవత్సరంలో హిందీ నికేతన్ స్థాపించారన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పరమేశ్వర రెడిమేట్స్ అధినేత దొంతంశెట్టి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పిన్నింటి ఏలూరులో హిందీ ఉద్యమం ప్రారంభించి ఎంతో మంది నిరాశ్రయులకు తన సంస్థలోనే ఆశ్రయం కల్పించి హిందీ భాషను నేర్పి, ఉద్యోగాలు వచ్చేటట్లు చేసిన మానవతావాది అని కొనియాడారు. రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిన్నింటి మంచి సంకల్పంతో స్థాపించిన హిందీ నికేతన్ సంస్థను ఉన్నత ప్రమాణాలతో నిర్వహిస్తూ హిందీ, తెలుగు భాష సేవలందిస్తున్నందుకు సంస్థ యాజమాన్యాన్ని అభినందిస్తున్నానన్నారు.

విజేతలు వీరే

వక్తృత్వ పోటీల జూనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ పురస్కారాలను వరుసగా పి.తనూజ, వై.పూర్ణిమ లలితా శ్రీ, ఆర్వీ సింగ్, ప్రోత్సాహక బహుమతులను ఎ.సంతోష్, పి.మనస్వీ మౌనిక పొందగా, సీనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ పురస్కారాలను కె.సింధు మాధురి, బి.పవన్ సాయి, పి.దేవి సౌజన్య, ప్రోత్సాహక బహుమతులను టి.పుష్కల, పి.డాన్సీ మహాలక్ష్మి పొందారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా హిందీ పండితులు పీఎం మోహన్ కుమార్, ఎం దేవి ప్రసాద్, వై.నాగరాజు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రామారావు వ్యవహరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు, బహుమతులు అందుకున్న విద్యార్థులు

వైద్యం వికటించిన బాలురకు ఆర్థిక సాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వివిధ ప్రమాదాల్లో గాయపడి ఏలూరులోని ప్రభ ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేయించగా, అవి వికటించి బాలల భవిష్యత్ ప్రశ్నార్థకం కావడంతో వారికి ఆసుపత్రి యాజమాన్యం నుంచి చెరో రూ.5 లక్షలు చొప్పున నష్టపరిహారంగా అందజేశారు. పెదవేగి మండలం వేగివాడ గ్రామానికి చెందిన చలమాల నాగరాజు కుమారుడు జగదీష్ (12) సుమారు మూడేళ్ల క్రితం ప్రమాదంలో గాయపడగా ఏలూరులోని ప్రభ ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించారు. అలాగే సూర్యారావు పేట గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి మాగంటి వెంకటేశ్వరరావు కుమారుడు పూర్ణ (14) బైక్ ప్రమాదంలో గాయపడగా అతనికి కూడా గతంలో ఇదే ఆసుపత్రిలో శస్త్ర చికిత్స నిర్వహించారు. అయితే వైద్యం వికటించి బాలురు ఇద్దరూ ఎన్నో ఇబ్బందులకు గురయ్యారు. బాలల భవిషత్తు ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు అందగా, ఆస్పత్రి యాజమాన్యం వారికి పరిహారం అందించేందుకు ముందుకొచ్చింది. ఈ విషయాన్ని దెందులూరు ఎమ్మెల్యే సీహెచ్ ప్రభాకర్ మంగళవారం జెడ్పీ గెస్ట్‌హౌస్‌లో సమావేశం నిర్వహించారు. బాలలకు అందించే మెరుగైన చికిత్స నిమిత్తం కూడా వారికి చెరో రూ.లక్ష చొప్పున ఇస్తామని ఆసుపత్రి యాజమాన్యం హామీ ఇచ్చారని తెలిపారు.

కో ఆప్షన్ సభ్యుల పదవులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులుగా పనిచేస్తున్న ఇద్దరు పురుష, ఒకరు మహిళా సభ్యురాలు ఇటీవల రాజీనామా చేయడంతో, వారి స్థానంలో కొత్తవారిని ఎన్నుకొనేందుకు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ఎ.భానుప్రతాప్ ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు దారులు నగరపాలక సంస్థ పరిధిలో ఓటరుగా నమోదై ఉండాలని తెలిపారు. గతంలో చైర్‌పర్సన్ / మేయర్ / వైస్ చైర్ పర్సన్ /డిప్యూటీ మేయర్ / సభ్యుడిగా ఐదు సంవత్సరాలు తక్కువ కాకుండా పదవీ కాలం పూర్తి చేసిన అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో గెజిటెడ్ హోదాలో పదవీ విరమణ చేసి పురపాలనలో ప్రత్యేక పరిజ్ఞానం అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. ఈనెల 18 నుంచి 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కార్యాలయ పనివేళల్లో దారఖాస్తు చేసుకోవాలని కోరారు.

గేమ్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు

దెందులూరు: దెందులూరు మండల స్థాయి స్కూల్ గేమ్స్ విజేతల ఎంపికైన వారి వివరాలను స్కూల్ గేమ్స్ మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్‌కుమార్ కొవ్వలి ఉన్నత పాఠశాలలో వివరాలు వెల్లడించారు. అండర్-17 విభాగంలో 100 మీటర్ల పరుగులో టి.గణేష్ (మేధినరావుపాలెం ఉన్నత పాఠశాల) ప్రథమ స్థానం, కె.వెంకటేష్ (దెందులూరు ఉన్నత పాఠశాల) ద్వితీయ స్థానం, 200 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం కె.మనోహర్ (మేధినరావు పాలెం ఉన్నత పాఠశాల), లాంగ్ జంప్‌లో టి.గణేష్ (మేధినరావుపాలెం ఉన్నత పాఠశాల), హైజంప్‌లో ఎం. మనోహర్ (మేధినరావుపాలెం) ప్రథమస్థానంలో నిలిచారు. షార్ట్‌పుట్‌లో ఎస్.రాజు (కొవ్వలి ఉన్నత పాఠశాల) ప్రథమ, వై.అద్భుతకుమార్ (పోతునూరు ఉన్నత పాఠశాల) ద్వితీయ స్థానంలో నిలిచారు.అథ్లెటిక్స్ బాలికలు 100 మీటర్ల పరుగులో ఎం.శ్రీవల్లి (మేధినరావు పాలెం) ప్రథమ స్థానంలో నిలిచింది. 200 మీటర్లల్లో పి.భువనేశ్వరి (మేధినరావుపాలెం) ప్రథమ స్థానంలో నిలిచింది. లాంగ్‌జంప్‌లో వై.నవ్యశ్రీ (మేధినరావుపాలెం) ప్రథమ, భాగ్యశ్రీ (కొవ్వలి) ద్వితీయ స్థానంలో నిలిచింది. హైజంప్‌లో వై.నవ్య శ్రీ (మేధినరావుపాలెం) ప్రథమ, షార్ట్‌పుట్‌లో వి.నిహారిక (కొవ్వలి) ప్రథమ స్థానంలో నిలిచింది.

అథ్లెటిక్స్‌లో బాలుర విభాగంలో విజేతలు: బాలుర విభాగంలో వి.సాయిచంద్ (మేధినరావు పాలెం) ప్రథమ, కె.ధనుష్ (మేధినరావుపాలెం) ద్వితీయ స్థానంలో నిలిచారు. 400 మీటర్ల పరుగులో పి.చరణ్‌తేజ్ (మేధినరావుపాలెం) ప్రథమ స్థానానికి ఎంపికయ్యారు. లాంగ్‌జంప్‌లో వి.సాయిచంద్ (మేధినరావుపాలెం) ప్రథమస్థానం సాధించారు. హైజంప్‌లో కె.ధనుష్ (మేధినరావు పాలెం) ప్రథమస్థానం, షార్ట్‌పుట్‌లో వీవీ సాయి చంద్ (మేధినరావుపాలెం) ప్రథమ, ఎం.వీర నాగార్జున (మేధినరావుపాలెం) ద్వితీయ స్థానంలో నిలిచారు.

అథ్లెటిక్స్ బాలికల విభాగం: 100 మీటర్ల పరుగులో జి.ఏసమ్మ (కొవ్వలి) ప్రథమ, కె.పావని (దెందులూరు) ద్వితీయ స్థానంలో నిలిచారు. షార్ట్‌పుట్‌లో జి.దీపిక (పోతునూరు) ప్రథమ, డి.లాస్య (పోతునూరు) ద్వితీయ స్థానంలో నిలిచారు. నియోజకవర్గ స్కూల్ గేమ్స్ పోటీలు ఎప్పుడు, ఎక్కడ నిర్వహించేది త్వరలో మండలంలో ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలకు, ప్రధానోపాధ్యాయులకు తెలియజేస్తామని మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్ తెలిపారు.

4 నుంచి అథ్లెటిక్స్ పోటీలు

దెందులూరు: ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ పోటీలు జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో అక్టోబర్ 4 నుంచి 6వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక ఈనెల 24న ఏలూరులో అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించనున్నట్టు ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు అండర్-10, 12, 14, 16, 18, 20 భాగాల్లో బాలబాలికలను ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 100 చెల్లించాలన్నారు. వయస్సు ధ్రువీకరణకు ఆధార్‌కార్డు, పుట్టినతేదీ ధ్రువపత్రం, 10వ తరగతి మార్కుల జాబితా కావాలన్నారు. ఈ పోటీల్లో విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయ వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. యనమదల రామస్వామి సత్రంలో నిర్వహించే ఈ అన్నదాన కార్యక్రమానికి హనుమాన్ జంక్షన్‌కు చెందిన కనుమూరి సత్యన్నారాయణ రాజు ఆర్థిక సాయం అందించారు. తొలుత అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ

ఉంగుటూరు: బొమ్మిడి - 1పాఠశాలకు దాతలు సహకారం అందించినట్లు హెచ్ఎం బొమ్మిడి ప్రసాద్ తెలిపారు. ఉంగుటూరు మండలం బొమ్మిడి - 1 పాఠశాల విద్యార్థులు 30 మందికి దాత తంగేళ్ల నాగేశ్వరరావు సహకారంతో ఐడీ కార్డ్‌లు అందజేసినట్లు తెలిపారు. దాత నాగేశ్వరరావును పలువురు అభినందించారు.

ఇసుక కొరత.. నిర్మాణ రంగం కుదేలు

- ఎక్కడికక్కడ నిర్మాణాల నిలిపివేత
- ఉపాధి కోల్పోయిన తాపీ మేస్త్రీలు, సహాయకులు
- ప్రభుత్వం స్పందించాలని కార్మికుల డిమాండ్

ఉంగుటూరు: ఇసుక దొరకక నిర్మాణ రంగం కుదేలైంది. డిమాండ్‌కు సరిపడా ఇసుక సరఫరా లేక ఎక్కడికక్కడ నిర్మాణాలు ఆగిపోయాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన చేబ్రోలులోని పాయింట్ వద్ద 449 మెట్రిక్ టన్నుల ఇసుక ఉంది. ఇది మట్టితో కలిసి ఉంది. నిర్మాణాలకు ఇక్కడి ఇసుక పని చేయని పరిస్థితి నెలకొంది. కేవలం పునాదుల్లో వేసుకునేందుకు మాత్రమే ఈ ఇసుక వాడుకోవడానికి పనికి వస్తుంది. దీంతో నిర్మాణానికి దూర ప్రాంతాల నుంచి ఇసుకను తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పాయింట్‌లో ఇప్పటి వరకు 115 టన్నుల ఇసుక మాత్రమే ప్రభుత్వం విక్రయించగలిగింది. కొత్తగా ఇసుకను నిల్వ చేయలేదు. ముందుచూపుతో వ్యాపారులు కొందరు స్టాకు చేసిన ఇసుకను అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రైవేటులో పది టన్నుల ఇసుకకు రూ.14,100 వసూలు చేస్తున్నారు. ఇసుకను అధికంగా నిల్వ చేసిన వారిలో ఎక్కువ మంది అధికారపార్టీకి చెందిన వారే ఉన్నారు. దాంతో అధిక ధరలకు ఇసుకను విక్రయించి వారంతా జేబులు నింపుకుంటున్నారు. వారి వద్ద కూడా ఇసుక నిల్వలు తరిగిపోవడంతో పాటు అధిక ధరలు భరించలేని పేద మధ్య తరగతి ప్రజలు నిర్మాణాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నారు. ఈ ప్రభావం నిర్మాణ రంగంపై పడి కార్మికులకు ఉపాధి కరువైంది. చాలా చోట్ల నిర్మాణాలను అసంపూర్తిగా నిలిపేశారు. ఇసుకను ప్రభుత్వం విరివిగా సరఫరా చేస్తేనే నిర్మాణాలు ప్రారంభమవుతాయని, కూటమి నాయకులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని నిర్మాణ రంగ కార్మికులు కోరుతున్నారు.



చేబ్రోలులో ఉన్న ప్రభుత్వ ఇసుక పాయింటు వద్ద ఉన్న కొద్దిపాటి పనికిరాని ఇసుక

“ నిర్మాణాలు ఆగిపోయాయి



ఇసుక సరఫరా నిలిపివేయడం వల్ల నిర్మాణాలు ఆగిపోయాయి. ఫలితంగా తాపీమేస్త్రీలు, సహాయకులకు పనులు లేక ఖాళీగా ఉండాల్సి వస్తోంది. నిర్మాణ రంగ కార్మికుల ఉపాధి దెబ్బతింది. అందరూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

– తవ్వాకుల రాంపండు, తాపీమేస్త్రి, చేబ్రోలు

సొసైటీ గోడౌన్ల తనిఖీ

దెందులూరు: అన్ని కోఆపరేటివ్ సొసైటీలు రికార్డుల నిర్వహణతో పాటు విధి నిర్వహణ సక్రమంగా ఉండాలని తహసీల్దార్ బి.సుమతి సూచించారు. మంగళవారం దెందులూరులో సోమవరప్పాడు, గాలాయగూడెం, జోగన్నపాలెం కోఆపరేటివ్ సొసైటీ గోడౌన్లను ఆమె తనిఖీ చేశారు. గోనె సంచులను, రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కొనసాగుతున్న సమ్మె

దెందులూరు: ప్రభుత్వ జూనియర్ వైద్యుల అసోసియేషన్ ఆదేశాల మేరకు జూనియర్ వైద్యుల సమ్మె 3వ రోజుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ డాక్టర్ల హక్కులు భవిష్యత్‌ను నష్టపరిచేలా విడుదల చేసిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దెందులూరు సీహెచ్‌సీ, పోతునూరు పీహెచ్‌సీ, గోపన్నపాలెం పీహెచ్‌సీలో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు అత్యవసర వైద్యసేవలు యథావిధిగా చేస్తున్నారు. సమ్మె నోటీసు ప్రకారం సాధారణ వైద్యసేవలు నిలుపుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ డాక్టర్ల హక్కులు, భవిష్యత్‌ను కాలరాసే విధంగా ఇచ్చిన జీవోను ఉపసంహరించుకునే వరకు యూనియన్ నుంచి వచ్చిన షెడ్యూల్ కొనసాగుతుందని యూనియన్ నాయకులు తెలిపారు.

దేశ సమగ్రాభివృద్ధి నరేంద్ర మోదీతోనే సాధ్యం

భీమడోలు: దేశ సమగ్రాభివృద్ధి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వల్లే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ అన్నారు. పీఎం నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని మంగళవారం మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో భీమడోలు, వడ్లపట్ల గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌లను కట్ చేశారు. వడ్లపట్లలో మండల ప్రధాన కార్యదర్శి వర్ధనేడి కపిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్, ఉంగుటూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శరణాల మాలతీ రాణి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): భారీ వర్షాలు, వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ, జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయాల వద్ద మంగళవారం ధర్నాలు నిర్వహించారు. పంట నష్టపరిహారాలను వెంటనే చెల్లించాలని, నష్టపోయిన రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని, వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని పెద్ద ఎత్తుననినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కొల్లేరు, బుడమేరు, తమ్మిలేరు, ఎర్రకాలువ, గోదావరి, పెదవాగు ప్రాజెక్టుకు గండి, నూజివీడుపెద చెరువు గండ్లు వలన వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. దీంతో వరి, ప్రత్తి, మిర్చి, ఉద్యాన పంటలు, ఆక్వా తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఆక్వా చెరువుల గట్లు తెగిపోయి చేపలు, రొయ్యలు కొల్లేరు పాలు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిరిబత్తుల సీతారామయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కోనా శ్రీనివాసరావు, నాయకులు వెలగలేటి మోహనరావు, లావేటి సోంబాబు, వాడపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

పీడీఎస్ బియ్యం పట్టివేత

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో సివిల్ సప్లయిస్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలోని బాట గంగానమ్మ లేఅవుట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, అక్రమంగా వ్యాన్‌లో సుమారు 340 కేజీల పీడీఎస్ బియ్యం రవాణా చేస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్‌డీటీ వైవీ లక్ష్మీ కుమారి తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న వక్కలగడ్డ అరవింద్‌కుమార్, పంపన సైదుబాబు, కోండ్రు కాశి ఫలనికుమార్ అలియాస్ ఫణిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.



పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న దృశ్యం

విద్యార్థుల్లోని అంతర్గత ప్రతిభను వెలికితీయాలి

దెందులూరు: అజెండా ప్రకారం వ్యాయామ విద్యాబోధన, పర్యవేక్షణ జరగాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ అలివేలు అన్నారు. మంగళవారం గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో దెందులూరు మండల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సెక్రటరీ అలివేలు మాట్లాడుతూ సెప్టెంబరులో నిర్వహించాల్సిన ఎస్‌టీఎఫ్ గేమ్స్ వివరాలు తెలిపారు. పీఈటీలు, పీడీలు విద్యార్థుల్లో అంతర్గత ప్రతిభను వెలికితీసేందుకు నూరు శాతం కృషి చేయాలన్నారు. మండల స్పోర్ట్స్ సెక్రటరీ జక్కుల సురేష్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ స్పోర్ట్స్ ఎప్పుడు నిర్వహిస్తామనేది అన్ని పాఠశాలల పీడీలు, పీఈటీలకు తెలియజేస్తామన్నారు. సమావేశంలో హెచ్ఎం డాక్టర్ ఎం.మనోహర్, మండలంలో పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అలివేలు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	37
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	45
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	27
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	28
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	32
ఏలూరు - తిరుపతి	16.00	4830	32